నున్నాడు. పైగా చిన్నపిల్లల్ని ఎప్పుడూ చూడనివాడిలా.. బాలమల్లు వైపు గుచ్చిగుచ్చి చూస్తున్నాడు. అట్లాగే కొద్దిసేపు పరీక్షగా చూసిన అతని కళ్లు మెరిశాయి.

''నీకు నేను తెలుసా? నన్ను గుర్తుపట్టినవా బిడ్డా..!'' అన్నాడు.

అపరిచిత వ్యక్తిని పరిశీలనగా చూసి.. తనకు తెలియనట్టు తిరస్కారంగా తల తిప్పాడు బాలమల్లు.

కొత్తమనిషి అలా నిలబడి.. మిడిగుడ్లతో తననే చూడటం అస్సలు నచ్చలేదు. వాడి కళ్లకు అతను చెడ్డవాడిలా కనిపించాడు.

''ఎవరు నువ్వు? మా ఇంట్లకొచ్చిన వెందుకు?'' కోపంగా అడిగాడు.

అప్పటికీ అతనేమీ మాట్లాడలేదు. బాలమల్లునే ఆప్యాయంగా చూస్తూ చిన్నగా నవ్వాడు. ఈలోగా లోపలినుంచి వచ్చిన బాలమల్లు తల్లి.. ఆగంతకుణ్ని ఆశ్చర్యంతో చూసింది. క్షణాల్లో తల్లి ముఖంలో మార్పు రావడం బాలమల్లు గమనించాడు. ఆగంతకుడు ఎవరో గుర్తించినట్టు ఆమె కళ్లు విభ్రాంతితో విప్పార్చుకున్నయి. ఉబికివచ్చే దుఃఖాన్ని ఆపుకొంటూ మరింత ముందుకొచ్చి చూసింది.

ఆమె కళ్లు కదలకుండా ఆగంతకుని మీదే నిలిచిపోయాయి. అతని పరిస్థితీ అలాగే ఉన్నది. రెండడుగులు ముందుకేసి సన్నిహితంగా ముందుకొచ్చాడు. ఆమె భుజం మీద చెయ్యి వేశాడు. ఉద్వేగంతో హఠాత్తుగా ఆమెను ఆలింగనం చేసుకున్నాడు.

ఈ పరిణామం బాలుకు కోపం తెప్పించింది. కొత్తవ్యక్తిని చూసి తల్లి ఏడవటం ఆశ్చర్యం కలిగించింది. తల్లి ఎలాంటి ప్రతిఘటన లేకుండా

అతణ్ని హత్తుకోవడం.. వాడికి అస్సలు నచ్చలేదు.

ఆగంతకుడు ఆమె ముఖం మీద అదేపనిగా ముద్దులు పెట్టాడు. అదిచూసి బాలమల్లు ఆవేశం పట్టలేకపోయాడు. ఎవరో ముక్కుముఖం తెలియని మనిషి.. తన్ను కావలించుకొని ముద్దులు పెడుతున్నా తల్లి ఏమీ అనకుండా ఏడుస్తూ అట్లాగే ఉండిపోవడం వాడికి చీదర కలిగించింది. తల్లి అవిధమైన ప్రవర్తన వాడెప్పుడూ చూడలేదు.

కొత్తవ్యక్తి బాలమల్లును అభిమానంగా చూస్తూ..

''ఈ పిల్లగాడెవరు? మనకొడుకేనా? నేను చూసినప్పుడు చాలా చిన్నగ ఉండె. ఇప్పుడు పెద్దగయిండు. ఎంత సక్కగున్నడు.. నీతీర్గనే!'' అన్నాడామెతో.

తల్లి అతని మాటలకు ఒకింత సిగ్గుపడటం, అప్పటికీ అతనికి దూరం తొలగకుండా సన్నిహితంగా ఉండిపోవడం బాలు గమనించాడు.

తల్లి ప్రవర్తన పట్ల ఎందుకో దిగులేసింది.

''చెప్పు.. ఈ పిల్లోడు మన బిడ్డనే గద!'' మళ్లీ అడిగాడు.

''అవునయ్యా.. వీడు మన బిడ్డనే!'' ఆమె అన్నది.

''నువ్విప్పటికే మళ్లా పెండ్లి జేసుకొని ఉంటవనుకున్న!'' అతను హీనస్వరంతో అన్నాడు.

''అయ్యో.. అదెట్ల? నువ్వుండంగ నేనెట్ల పెండ్లి జేసుకుంట?'' అన్నదామె.

అంతేకానీ..

'భార్యను నేనుండగా నువ్వెందుకు ఇంకో ఆడదానితో లేచిపోయి మనువు జేసుకున్నవ్? నాలో ఏం లోపమున్నది? పెండ్లాం మీద మనసు లేకుంటే పాయే.. కనీసం కొడుకుమీద ఉండాలె గద. చంటిపిల్లోని మొఖం కూడ నిన్ను పోకుండ ఆపకపాయె!'.. అని ఆమెలోని సగటు స్త్రీ నిలదీసి అడగలేకపోయింది.

''గిన్ని దినాలకు మేమెట్ల యాదికొచ్చినం?'' అని మాత్రమే అడిగింది.

''పిల్లోని మీద మనసు గుంజులాడింది. నువ్వు కూడ మాటిమాటికి యాదికొచ్చినవు''.

'మరి నువ్వు మోజుపడి తీస్కపోయిన ఆడది యాడబోయింది?' అని అడగాలనుకొని.. మానుకుంది.

అతను బాలమల్లు దగ్గరగా వచ్చి అన్నాడు..

''ఏం పేరు కొడుకా నీది?''.

''బాలమల్లు!''.. కొడుకుకన్నా ముందు ఆమెనే చెప్పింది.

''నేనెవరో తెలుసునా? నీ కన్న తండ్రిని. నన్ను 'నాయినా!' అని పిలువు బిడ్డా!'' చెయ్యి పట్టుకుంటూ అడిగాడు.

బాలమల్లు కోపంగా విదిలించికొట్టాడు.

''నువ్వెవరో నాకు తెల్వది. నువ్వు మా నాయిన కాదు'' అన్నాడు.

మధ్యలో తల్లి జోక్యం చేసుకుంది.

''అది నిజం కొడుకా..! ఈయన మీ నాయినే!'' అన్నది సర్దిచెబుతూ.

''లేదు.. నాకు నాయిన లేడు. సచ్చిపోయిండు''.

''తప్పుబిడ్డా! అట్లనొద్దు. నీకు తండ్రి ఉన్నడు. ఈయనే నీ తండ్రి''.

''ఈన మా నాయిన కాదు. మా నాయినెప్పుడో సచ్చిపోయిండు'' గట్టిగా అరిచిండు బాలమల్లు.

దీనికి అతను బాధపడినట్టు కనిపించాడు. అదిచూసి ఆమెకూడా బాధపడింది. అనునయంగా అతని భుజాలపై చేతులువేసి.. గుండె మీద తలవాల్చింది. కాసేపటివరకూ అట్లాగే ఉండిపోయింది.

''వాడు చిన్న పోరడు. వాని మాటలకు మనసు కష్టపెట్టుకోవొద్దు'' అన్నది.

అతను ఆమె నుంచి విడివడి దూరం జరిగాడు. ఉన్నట్టుండి కింద కూలబడి రెండుచేతుల్లో ముఖం దాచుకున్నాడు. అతణ్ని ఆ స్థితిలో చూసి.. ఆమె ఏడవసాగింది. ఇదంతా బాలమల్లు సహించలేకపోయాడు. ఇంతకాలంగా సంతోషంగా ఉంటున్న అమ్మ.. ఇప్పుడిట్లా బాధపడడానికి కొత్తమనిషే కారణమని వాడు భావించాడు. తక్షణం అతణ్ని ఇంట్లోంచి బయటికి వెళ్లమని చెప్పాలనుకున్నడు. ఈలోగా తల్లి వాణ్ని బుజ్జగిస్తూ.. ''బాలూ! ఆయన నీ తండ్రేరా. అంత ప్రేమగ పిలుస్తున్నడు గదా.. దగ్గరికి పో బిడ్డా! 'నాయినా!' అని పిలువు'' అన్నది.

''ఈ మనిషి మా నాయిన కాడు. నేను పిలువను. ముందు ఆయన్ను ఇంట్లనుంచి పొమ్మని చెప్పు'' గట్టిగా అన్నాడు.

''తప్పురా.. అట్ల అనొద్దు! మీ నాయిన సూడు ఎంత బాధపడ్తుండో !''.

''అతను మా నాయిన కాదంటుంటే ఇనవేంది? నాకసలు నాయినే వొద్దు!''.

''గట్ల మాట్లాడకు. నా మాట విని.. మీ నాయిన దగ్గరికిపో!'' కొడుకును బలవంతంగా అతనివైపు నెడుతూ చెప్పింది.

బాలమల్లు తల్లి చేతుల్ని విదిలించి కొట్టాడు.

''నేను పిలువను. నాకు తండ్రి లేడు. ఎప్పుడో సచ్చిపోయిండు. ఈనెవరో నాకు తెల్వది''.

ఆ మాటలతో ఆమె కోపం పట్టలేక కొడుకు చెంపమీద కొట్టింది. బాలమల్లు నిర్ఘాంతపోయాడు. ఏనాడూ చిన్న దెబ్బయినా వేయని తల్లి.. మొదటిసారి తనని కొట్టింది. వాడికి కోపమూ, రోషమూ ఏకకాలంలో పొంగుకొచ్చినయి.

తండ్రినని చెప్పుకొంటున్న ఆగంతకుణ్ని కసితో చూశాడు. దీనికంతటికీ ఇతనే కారణం. ఆవేశం కలిగినా.. అతణ్ని ఏమీచేయలేని నిస్సహాయతతో పెద్దగా ఏడవసాగాడు. కోపంగా కాళ్లు నేలకేసి బాదుకుంటూ.. దూరంగా వెళ్లిపోయి కూర్చున్నాడు. అదిచూసి కొత్తవ్యక్తి లేచి బాలమల్లు దగ్గరికొచ్చాడు. వాడి తలమీద చెయ్యేసి చిన్నగా నిమిరాడు.

''నిజం బిడ్డా! నేను నీ తండ్రినే'' అనునయించాడు.

''కాదు! అంతా అబద్ధం. నువ్వు మోసగానివి. నాకు నాయిన లేడు.. సచ్చిపోయిండు''.

''లేదు బాబు. మీ అమ్మకూడ చెప్తున్నదిగద. నేనే నీ తండ్రిని''.

''నీకసలు బుద్ధుందా..? గింత పెద్దగైనవు! ఎన్నిసార్లు చెప్పాలె.. మా నాయిన సచ్చిపోయిండని?'' గట్టిగా అరుస్తూ బాలమల్లు అక్కణ్నుంచి లేచి విసురుగా లోపలికి పోయాడు. మరో రెండు నిమిషాల తర్వాత తిరిగొచ్చిన వాడిచేతిలో చిన్న అట్టపెట్టె ఒకటి ఉన్నది. దాన్ని ఆగంతకుని చేతిలో పెట్టి..

''మా నాయిన సచ్చిపోయి పితరుల్లో కలిసి తూనీగ అయిండు. నీలంరంగు తూనీగ. ఈ పెట్టెల ఉన్నడు కావాల్నంటే సూడు..'' అన్నాడు.

కొత్తవ్యక్తి కుతూహలంతో పెట్టె తెరిచాడు.

మూత తీయగానే.. లోపలున్న నీలంరంగు తూనీగ ఒకటి బయటికొచ్చి, బలహీనంగా గాల్లోకి ఎగురుతూ పోయింది.

అదిచూసి అతను నివ్వెరపోయిండు.

బాలమల్లు తల్లి.. శిలాప్రతిమే అయ్యింది! ■

## ఎగుమామిడి అయోధ్యారెడ్డి



రైతు కుటుంబంలో పుట్టి, జర్నలిస్టుగా ఎదిగి, రచయితగా రాణిస్తున్నారు అయోధ్యారెడ్డి. పొలిటికల్ సైన్స్‌లో ఎంఏ, డాక్టరేట్ చేశారు. 1983లో 'ఉదయం' దినపత్రికలో జర్నలిస్టుగా వృత్తిజీవితాన్ని మొదలుపెట్టారు. మూడు దశాబ్దాలు దక్కన్ క్రానికల్ సంస్థలో పని చేసి.. న్యూస్ ఎడిటర్‌గా విరమణ పొందారు. పాఠశాల రోజుల నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకున్నారు. కాలేజీ రోజుల్లోనే కలం చేతపట్టి.. కథలు రాశారు. తొలికథ 'మృత్యువులో వ్యత్యాసం'. 1974లో గులాబి మాసపత్రికలో అచ్చయింది. ఇప్పటివరకు 70కి పైగా కథలు, రెండు నవలలు రాశారు. 40కి పైగా విదేశీ కథలు, ఒక విదేశీ నవలను తెలుగులోకి అనువదించారు. ఆరు పుస్తకాలను వెలువరించారు. నాటి ప్రసిద్ధ పత్రికలైన భారతి, యువ, స్రవంతి, ప్రగతి మొదలుకొని.. నేటితరంలోని అన్ని ప్రముఖ దిన, వార, మాస, వెబ్ పత్రికల్లో వీరి కథలు ప్రచురితమయ్యాయి. పలు పత్రికలు, ఆలిండియా రేడియో కోసం సాహిత్య విమర్శలు, వాణిజ్య, క్రీడారంగ వ్యాసాలు రాశారు. కొన్ని కథలకు ప్రధాన పత్రికల నుంచి బహుమతులు పొందారు. నాగిరెడ్డి – చక్రపాణి అవార్డు, సాహితీ గౌతమి, పాకాల యశోదారెడ్డి, మాడభూషి, తెలుగు వర్సిటీ పురస్కారాలు అందుకున్నారు.